# వారు అనంత సాగరమును కోల్పోయిరి

ఆధ్యాత్మిక పరిధిలో నైతిక విలువలను పెంపొందించుకొనుట ముఖ్యము. దీని ప్రాముఖ్యత ఆధ్యాత్మిక ప్రగతికంటె తక్కువ కాదు. పూజ్య లాలాజీ మహారాజ్ కూడా ఆధ్యాత్మిక ప్రగతిపథంలో నైతిక విలువల ప్రాముఖ్యతను నొక్కి చెప్పినారు. ఒక చోట అయన ఈ విధముగా వ్రాసినారు "ప్రతివ్యక్తి, ప్రతి సాధకుడు మొదటినుండి తన నైతికప్రవర్తనను నిలుపుకొనుటకు, పెంపొందించుకొనుటకు ఎక్కువగా కృషి చేయవలెనని నేను చెప్పెదను. ఇతరులకు ఆక్షేపణకరమైన ఏ మాటయు మన నోటినుండి రాకూడదు. అటులనే యితరులకు బాధాకరమైన ఎటువంటి పని చేయరాదు. నేను ఆధ్యాత్మికతకన్న నైతిక విలువలనే ఎక్కువగా ప్రేమిస్తాను. ఒక వ్యక్తి నైతిక విలువలను పెంపొందించుకొనక ధృవపథము చేరుకొన్నను ఆతడు నిజమైన తత్వజ్ఞానమును అర్థము చేసుకొనలేదని నేను భావించెదను."

మన సంస్థయొక్క అభ్యాసులలో ప్రవర్తనాలోపములుండ రాదని నేను అభిలషించినాను. కాని నేను అట్లనుకొనిన లాభమేమి? అందరితోను ఒక్కటై యుండుట అభ్యాసులలో లోపించినది. వారంతటవారు ఏ పనిచేయుటకు యిష్టపడుట లేదు. వారి ఉన్నతికొరకు అవసరమగునవన్నియు నా అంతర్గత శక్తులనుపయోగించి నేనే చేయవలెనని వారు కోరుకొందురు. వారు ధ్యానము మరియు నిత్యసాధన చేయుకోరిక కలుగునట్లు, వారికి పురోగతిని కల్పించి వారిలో ఈ విషయములపై శ్రద్ధ కలుగునట్లు, వారంతట వారు ఏమియు చేయకుండా నా శక్తులను ఉపయోగించి నేను చేయవలెనని అభిలషించెదరు. వారి జీవితపు అలవాట్లలో కొద్దిగానైనను మార్పులు చేసుకొనక, వారికి బోధించిన సాధనను ఏమాత్రము ఆచరించరు. కాని వారిలో ఏదైనా లోపము లేదా ఏ ఒక్కరిలోనైన ఆధ్యాత్మిక పురోగతిలో తేడా కాని కనిపించినచో దానికి బాధ్యత మరియు నింద నేనే భరించవలెను. నాకు వేరొక యిబ్బంది కూడా కలదు. సాధకుల సహకారము లేకున్నా వారిపై నాకుగల సానుభూతివలన యెల్లప్పుడు వారికి సహాయము చేయవలెనను అభిలాష కలదు. అందువలన వారికి నాపైనున్న గౌరవముతో మర్యాద పూర్వకముగా నన్ను కోరిన వెంటనే సహాయము చేయుటకు సిద్ధమైయుండెదను. నాలోని ఆధ్యాత్మికతనంతయు అమితముగా వారు దానిని ఆకళింపుచేసుకొనుటకు సిద్ధముగా ఉన్నారా లేదా అనునది పట్టించుకొనక వారిలో చొప్పించవలెనని నా ప్రగాఢమైన కోరిక. ఇంతకన్న నేనేమి చేయగలను? ఇంకను వారికి ఎంత శక్తినీయవలెనని పరికించిన యింద్రియములు వశము తప్పి, మొత్తమంతయు రంగరించి వారిచేత త్రాగించవలెనను కోరిక కలుగును. కాని దీనికి కూడా ఒకరు లేదా యిద్దరు మాత్రమే అర్హత కలిగియుందురు. ఇదే నా అదృష్టము. అందరి పని విజయవంతముగా సంపూర్ణము కావలెననునది నా ప్రగాఢమైన కోరిక. ఎవ్వరి ప్రయత్నము వృధాగాపోదు. కాని ప్రయత్నము చేయుటయే కష్టముగా కనపడుచున్నది.

ఇది నేను ఎంతచెప్పినను అర్థము చేసుకొనరు. వారి స్వస్థానము చేరుకొనకుండా అనేక లక్షల జన్మలు గతించిపోయినవి. ఇప్పటికిని వారికి ఆ అవసరము లేనట్లుగా వ్యవహరించుట మిక్కిలి విచారించవలసిన విషయము. ఇప్పటికిని ఎవ్వరికిని ఆ దిశగా పయనించుటకు యిచ్ఛ లేనపుడు నేను ఏమి చేయవలెనో నాకు పాలుపోవటము లేదు.

నా సహాధ్యాయులపై ఎనలేని ప్రేమతో నా హృదయము పూర్తిగా నిండిపోయినది. నేను చేయగలిగిన సేవ వారికి చేసినను నాకు తృప్తి కలుగుటలేదు. వారిలో ఎక్కువమంది అతి తక్కువ సమయములో కనీసం నా ఆధ్యాత్మిక స్థితికైనను ఎదగవలెనని నా హృదయములోని ప్రగాఢమైన కోరిక. ఈ సందేశము సరియగురీతిలో ప్రజలలో చాలామందికి చేరవలెనను ఉద్దేశముతోను మరియు వారిని మేల్కొలిపి, వారి నడవడిక, శీలము, ప్రవర్తనలను సరియైన రీతిలోనికి తీసుకొనివచ్చుటకు అనేకమంది శిక్షకులను నియమించితిని.

భారతదేశములో పురాతన కాలమందు ఈ పద్ధతి బహిరంగపరచకుండా రహస్యముగా ఉంచబడినది. దానివలన పూర్వకాలములోని ఋషులు దీనిని తమ శిష్యులలో కొద్దిమందికి మాత్రమే బోధించిరి. వీరిలో కొంతమందికి దీనిని యితరులకు అందించు శక్తి లేకపోయెను. కాలానుగుణంగా మార్పులు, పరిస్థితులు కూడ దీనిపై ప్రభావము చూపెను. క్రమముగా ఈ పద్ధతి మరుగునపడినది. సత్యము కనుమరుగై దాని వ్యతిరేక భావనలు, తారతమ్య భేదములు పుట్టుకొనివచ్చి చిన్నపాటి విజయములతో ప్రజలు సంతృప్తిచెంది అదియే పూర్తి విజయముగా నమ్ముట మొదలిడిరి. ఆధ్యాత్మిక నావ సరస్సులో పూర్తిగా మునిగి మరుగుపడినది. చూచువాళ్లందరకు యిదియే పరిపూర్ణమైనదిగా తోచుచున్నది. అందరూ సరస్సును చూచి ఆకర్షింపబడుచున్నారు తప్ప ఎవ్వరికీ సాగరమును గూర్చిన ఆలోచన కొంచెమైననూ లేదు. ఆ విధముగా వారు ఒక పరిమితికి లోబడియుండుటవలన త్వరితముగా స్థూలత్వము పెంపొంది స్థూలశరీరమునకు విపరీతమైన ప్రాముఖ్యత పెరిగిపోయినది.

అప్పుడు అహంకార బంధము మితిమీరి వారు నిజానికి గొప్పవారు కాకపోయినను గొప్పవారను అభిప్రాయము బలపడినది. ఈ విధమైన అభిప్రాయములు మన శిక్షకులలో కూడ ఉదయించుట ప్రారంభమై ఈ వ్యాధి నిర్మూలింపబడుటకు బదులుగా వ్యాపించుచున్నది. వారికి శక్తినిచ్చుట నాకు ప్రమాదముగా పరిణమించినది. దైవమును చేరుటకు మరియు యితరులకు మేలుచేయుటకు ఈ శక్తి కలదు. కాని యిటువంటి వ్యక్తులలో స్వార్థపరమైన లాభములకు యిది ప్రేరేపించుచున్నది. దీనికి తోడు యితరులకు తప్పుడు విధానములు బోధించుటకు వారి సాధనను కూడ తర్కించుట ప్రారంభించినారు. శిక్షకులైనను వారు కూడా అభ్యాసులుగా కొనసాగెదరను విషయమును వారు పూర్తిగా మరచిపోయినారు. ప్రారంభములో ధ్యాన

సాధనకు చెప్పిన వివరణములతో కూడిన సూత్రములు, పద్ధతులకు వారి స్వంత భావములను చొప్పించి అభ్యాసులకు వారి సాధనాపద్ధతితో మార్పుచేసిన విధానములను బోధించుచున్నారు. కొంతమంది శిక్షకులు ఒక పద్ధతి, మరికొంతమంది యింకొక పద్ధతిని బోధించుచున్నారు. సూక్ష్మ మైన సాధనాపద్ధతులలో ఏ మాత్రము మార్పు చేసినను విపరీతమైన ఫలితములు కలుగునని వారికి తెలియుట లేదు. అనంతత్వమునంతను పొందినానని ఏ ఒక్క డైన చెప్పు కొనగలడా? వడ్లగింజంత సత్‌తత్వమును పొందినను అది ఎంత విలువైనదనగా ఈ ప్రపంచములోని ఐశ్వర్యమంతయు దానికి సరితూగదు. వారికి శక్తినిచ్చినది వాస్తవమే. కాని అహంకారము మరియు స్వార్థపూరితమైన దృష్టిలో కూరుకుపోయి ఈ శక్తిని వినియోగించవలెనని వారు కోరుకొనుచున్నారు. ఇది నాపై రెండింతల భారము మోపునని వారు ఎప్పుడూ ఆలోచించరు. (ఒకటి ఆధ్యాత్మికముగా వారిని ముందుకు నడిపించుటకు, రెండవది వారు సృష్టించుకుని పెంపొందించుకొనిన అహంకార బంధనములనుండి వేరుచేయుటకు). వారు చేయు ఈ చిన్న తప్పిదమువలన నాకు పని భారము ఎంతగా పెరుగునో వారికి అర్థము కాదు. బహుశా దీనిని అంగీకరించు స్థితిలో వారు లేరు. వాళ్ల అహంకారముపై విశ్వాసము పెంచుకొని అదియే శక్తిగా భావించి దానిలో చిక్కుకొనినారు. వారు దీనిలో ఎంతగా లీనమైనారనిన వారిని బయటకు తీసుకొనివచ్చుటకు చేయు ప్రయత్నము, ఉక్కునుండి పప్పుదినుసులను తీయుటను పోలియున్నది. వారు శక్తి అను పదమును మాత్రమే నేర్చుకొన్నారు. కాని శక్తి అనగా యేమిటి అను దానిని అర్థము చేసుకొని, దానిని యితరుల మేలుకొరకు యేవిధముగా ఉపయోగించవలెనను ప్రయత్నము చేయుటలేదు. మరికొంతమంది ఉప్పుడు బియ్యమును పప్పుదినుసుగా భ్రమపడి దానితోనే అమితమైన సంతోషమును పొందెదరు. వారు దారి తప్పినారనునది మాత్రమే వారి గురించి చెప్పగలిగినది. వారు వారి విధియైన ధర్మమును వీడినారు కాబట్టి తిరిగి దారిలోనికి తీసుకొనివచ్చుట దాదాపు కష్టసాధ్య మైనది. నేను పడిన శ్రమకంతటికి యిదే లభించిన బహుమానము. అటువంటి వారికి నేనేమి చెప్పగలను? ఇది నా విధి అని మాత్రమే చెప్పగలను.

సంస్థకు సంబంధించిన అన్ని కేంద్రములు మహాత్మ లాలాజీ మహారాజ్ వారివి కాని ఏ ఒక్కరిసొత్తు కాదు. వారి ఆదేశములననుసరించి మనందరము పనిచేయుచున్నాము. ఇప్పటికైనను వారు తమలో మార్పు తెచ్చుకొని నాతో సహకరించనిచో, నేను వారికి సహాయపడుటకు చేయు దృఢప్రయత్నములను లక్ష్య పెట్టనిచో, సద్గురువు కృపవలన వారికి అనంత సాగరము లభించినను, వారి తెలివితక్కువ వలన దానిని కోల్పోయెదరు. సంస్థలోని అభ్యాసులు మరియు శిక్షకులు సనాతన బోధనలను ఆచరణలో పెట్టవలెను.

“నాది అనునది నాకు ఏమియు లేదు. నాకున్నది ఏకొద్ది మాత్రమైనదైనను అది మీదే.

అందులో మనందరికి అంతా మేలు చేయునదియే వున్నది”.

* * *